
అప్పుడు సునీల్.. ఇప్పుడు ఎంఎస్ బాబు

జిల్లా వైసీపీ ఎమ్మెల్యేల్లో తొలి తిరుగుబాటు జెండా ఎగిరింది. అణచిపెట్టుకున్న అవమానం దుఃఖాగ్రహంగా మారి కట్టలు తెంచుకుంది. ఐదేళ్లు ఎమ్మెల్యేగా చేసిన సేవలన్నీ తాడేపల్లి ప్యాలెస్ తీసుకున్న నిర్ణయం ముందు బదాబదలయ్యాయి. ఐప్యాక్ టీం వేసిన తూకంలో నీళ్ల కన్నా పలచన అయిపోయానంటూ పూతలపట్టు దళిత ఎమ్మెల్యే ఎంఎస్ బాబు మంగళవారం ప్రకటించిన ఆవేదన ప్రజల్లో చర్చగా మారింది. నా ఎస్టీలు.. నా ఎస్సీలు.. నా బీసీలు.. నా మైనారిటీలు.. అంటూ సభల్లో హోరెత్తే మాటల వెనుక ఉన్నది ఇదా అని దళిత, బీసీ, మైనారిటీ వర్గాలు ఆగ్రహంతో ఉన్నాయి.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

● వైసీపీలో దళిత ఎమ్మెల్యేలే టార్గెట్



పూతలపట్టు నుంచి ఎంఎస్ బాబుకు టికెట్ లేదని జగన్‌రెడ్డి తేల్చేయడంతో ఆయన మంగళవారం మీడియా ముందు కడుపుచించుకున్నారు. తన బాధ పంచుకున్నారు. వైసీపీ అధిష్ఠానానికి అనేక ప్రశ్నలు సంధించారు. అయితే 2019 ఎన్నికల సమయంలోనూ పూతలపట్టు విషయంలో జగన్ ఇదే తీరులో నిర్ణయం తీసుకున్న విషయాన్ని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. పదవిలో ఉన్నా దళితులకు వైసీపీలో పవర్ ఉండదని అంటున్నారు. మండల స్థాయిలో కూడా ఒక సామాజికవర్గం నాయకులకు అణిగిమణిగి ఉండాల్సి వస్తోందని అంటున్నారు. ఇన్ని భరించినా మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి టికెట్ లేదంటూ తూచ్ అనేయడం ఏమిటన్న ప్రశ్న ఇప్పుడు వైసీపీలోని దళితవర్గాల నుంచి వినిపిస్తోంది.

ఎంఎస్ బాబు ఆవేదన

"ఈ ఐదేళ్ల పాటు పార్టీ పెద్దలు, మంత్రులు చెప్పినట్లు నడుచుకున్నా. ఇప్పుడు వ్యతిరేకత ఉందంటే బాధ్యత ఎవరిది? వ్యాపారాలను, కుటుంబాన్ని వదిలేసి కష్టపడితే ఇదా ఫలితం? నేనేం పాపం చేశాను. దళితుడిగా పుట్టడమే వేస్టా?"

"మాటిమాటికి నా ఎస్సీలు, నా ఎస్టీలు, నా బీసీలు, నా మైనార్టీలు అంటారే గానీ, మాకేం న్యాయం చేస్తున్నారు? రెడ్లు చెప్పిందే నేను చేశాను. సీఎం గారూ.. దళితులను మోసం చేయొద్దు."

"చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో వ్యతిరేకత ఉన్నా ఓసీలకు మళ్లీ టికెట్లు ఇస్తున్నారు. డబ్బులిస్తే ఇష్టమొచ్చినట్లు ఐప్యాక్ సర్వే ఫలితాలను మారుస్తుంది. మరి వ్యతిరేకత వచ్చిందంటూ దళితులనే మార్చడమేంటో నాకు అర్థం కావడం లేదు."

జగన్ ఇంటి గేటు వద్ద రోజంతా పడిగాపులు కాసినా..




2019 ఎన్నికల సందర్భంగా జగన్ ఇంటి వద్ద వేచి ఉన్న నాటి ఎమ్మెల్యే సునీల్

2014 ఎన్నికల్లో పూతలపట్టు వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సునీల్‌కుమార్‌ను 2019 ఎన్నికల సమయంలో వైసీపీ అధిష్ఠానం ఘోరంగా అవమానించింది. పిలిపించి టికెట్ లేదని గౌరవంగా కూడా చెప్పలేదు. అప్పట్లో టికెట్ మళ్లీ తనకే ఇవ్వమంటూ అడిగేందుకు లోటస్‌పాండ్‌లోని జగన్ ఇంటికి వెళ్లిన సునీల్‌కుమార్‌ను కనీసం ఇంట్లోకి కూడా రానివ్వలేదు. జగన్ ఇంటి గేటు వద్ద కుటుంబ సభ్యులతో కలిసి సునీల్‌కుమార్ రోజంతా నిలబడిన ఫొటోలు, వీడియోలు అప్పట్లో వైరల్ అయ్యాయి.

అసలేం జరిగింది?

2019లో ఎమ్మెల్యేగా గెలిచాక ఇప్పటిదాకా ఒక్కసారి కూడా సీఎం జగన్‌ను నేరుగా కలిసి మాట్లాడే అవకాశం ఎంఎస్ బాబుకు లభించలేదు. కాణిపాకంలో బ్రహోత్సవాలకు ఆహ్వానించేందుకు మాత్రం ఓసారి కొందరితో కలిసి వెళ్లి ఆయన సీఎంని కలిశారు. నియోజకవర్గ పరిస్థితుల్ని చెప్పుకునేందుకు అనేకసార్లు సీఎం అపాయింట్‌మెంట్ కోరినా ఫలితం లేదని ఎంఎస్ బాబు చెప్పారు. విచిత్రం ఏమిటంటే.. వచ్చే ఎన్నికల్లో టికెట్ ఇవ్వడం లేదని చెప్పడానికి మాత్రం సీఎంవో నుంచి పిలుపు వచ్చింది. సుమారు వారం కిందట ఎంఎస్ బాబుతో సీఎం జగన్ నేరుగా భేటీ అయ్యారు. 'ఈసారి నీకు టికెట్ ఇవ్వడం కుదరడం లేదు. సర్వేల్లో నీ గురించి వ్యతిరేకంగా వచ్చింది. మనం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తాం' అని చెప్పినట్లు తెలుస్తోంది. అయినా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అండతో సీఎం మనసు మార్చుకోవచ్చని ఆయన నమ్మినట్టు చెబుతున్నారు. అయితే సోమవారం పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి కూడా ఈసారి టికెట్ లేదనే విషయాన్ని బాబుకు తేల్చి చెప్పేశారని, దీంతో మథనపడ్డ ఆయన మంగళవారం మీడియా ముందు మనసులో ఉన్నదంతా బయటపెట్టేశారని తెలుస్తోంది.



ఎంత తలొగ్గినా...



సునీల్‌కుమార్

సునీల్‌కుమార్‌కు టికెట్ ఇవ్వకపోవడం వెనుక జిల్లాను తన గుప్పెట్లో పెట్టుకున్న పెద్దనాయకుడి పాత్ర ఉందని అప్పట్లో ప్రచారం జరిగింది. అప్పట్లో సునీల్‌కుమార్‌ను కాదని ఎంఎస్ బాబుకు టికెట్ ఇప్పించిన ఆ పెద్దాయనే ఇప్పుడు బాబుకూ ఎసరు పెట్టారని అంటున్నారు. పూతలపట్టు నియోజకవర్గంలో ఎమ్మెల్యే ఎంఎస్ బాబు ఈ ఐదేళ్ల పాటు స్వతంత్రంగా పని చేయలేకపోయారనేది బహిరంగ సత్యం. ప్రతి విషయంలోనూ పార్టీ పెద్దలు, మంత్రులు జోక్యం చేసుకునేవారు. ఆయన కూడా ధిక్కారంగా ఎన్నడూ వ్యవహరించేవారు కాదు. యాదమరి, తవణంపల్లె, బంగారుపాళ్యం, ఐరాల, పూతలపట్టు మండలాల్లో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులే పెత్తనం చెలాయించారు. వార్డు మెంబర్ నుంచి జడ్పీటీసీ వరకు ఎమ్మెల్యే ప్రమేయం లేకుండా తాము సూచించిన వారికి పదవులు దక్కేలా చూసుకున్నారు. ఎమ్మెల్యే వద్దన్నచోట ఇండిపెండెంట్లను రంగంలోకి దింపి గెలిపించుకున్నారు. కాణిపాకం ట్రస్టు బోర్డు చైర్మన్, బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్ వంటి పదవుల్లో రెడ్డి సామాజికవర్గానికి చెందినవారే ఉన్నారు. బంగారుపాళ్యం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా మాజీ జడ్పీటీసీ మనోహర్ భార్య సెల్వికి ఎమ్మెల్యే సిఫార్సు చేసినా, పట్టించుకోని అధిష్ఠానం పరమేశ్వర్‌రెడ్డికి అప్పగించారు. ఐరాల మండలంలో ఓ ఎంపీటీసీ స్థానానికి ఎమ్మెల్యే బీఫాం ఇచ్చిన వ్యక్తిని కాదని అక్కడ కూడా ఇండిపెండెంట్ అభ్యర్థిని నిలబెట్టి రూ.లక్షలు ఖర్చు పెట్టి గెలిపించుకున్నారు. యాదమరిలో ఓ తహసీల్దార్‌ను ఎమ్మెల్యే బదిలీ చేయిస్తే, మండలంలో ప్రాబల్యం ఉన్న ఓ నేత అదే తహసీల్దార్‌ను సాయంత్రానికి తెచ్చుకున్నారు. ఇలాంటి ఉదాహరణలు నియోజకవర్గంలో చాలా ఉన్నాయి. నియోజకవర్గంలో ప్రతి మండలానికో రెడ్డి నాయకుడు పెత్తనం చెలాయిస్తూ, ఆయా మండలాల్లో ఎమ్మెల్యే మాట చెల్లకుండా డమ్మీగా చిత్రీకరించారు. అయినా ఎన్నికలు వచ్చాక నింద ఎంఎస్ బాబు మీద మోపేసి టికెట్ ఎగ్గొట్టడం విశేషం.



ఆ ఇద్దరికీ లైన్‌క్లియర్

● తిరుపతి, చంద్రగిరి వైసీపీ సమన్వయకర్తలుగా అభినయ్, మోహిత్

● మిగిలిన సెగ్మెంట్లలో మార్పుచేర్పులకు అవకాశం? ● పార్టీ ప్రకటనతో ఇతర సెగ్మెంట్ల నేతల గుండెల్లో రైళ్లు





తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ నియోజకవర్గాలకు వైసీపీ అధిష్ఠానం సమన్వయకర్తలను ప్రకటించింది. మంగళవారం రాత్రి విడుదల చేసిన జాబితాలో తిరుపతికి డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డిని, చంద్రగిరికి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పేర్లను ప్రకటించింది. ఇదేమీ కొత్త విషయం కాకపోవడంతో వీరి పేర్ల ప్రకటన ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పెద్దగా ఆశ్చర్యం కలిగించలేదు. అదే సమయంలో మిగిలిన చోట్ల మార్పుచేర్పులు తప్పవన్న సంకేతం వెలుడడంతో ఆయా నియోజకవర్గాల ముఖ్యనేతల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

తిరుపతి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి 2019లో కొత్త మంత్రివర్గం ఏర్పాటైన వెంటనే తాను తదుపరి ఎన్నికల్లో పోటీ చేయబోవడం లేదని, ప్రత్యక్ష పోటీ రాజకీయాలకు దూరంగా ఉంటానని ప్రకటించిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచే ఆయన వారసుడిగా కుమారుడు అభినయ్‌రెడ్డి బరిలో ఉంటారని పార్టీ వర్గాలతో పాటు ప్రజలూ భావించారు. గతేడాది తిరుపతిలో వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలోనూ అభినయ్‌రెడ్డిని గెలిపించాలని శ్రేణులను కోరారు. దీంతో తిరుపతి వైసీపీ అభ్యర్థి అభినయ్‌రెడ్డి అన్నదాంట్లో ఎవరికీ ఎటువంటి అనుమానాలు లేకుండాపోయాయి. ఇక చంద్రగిరి విషయంలోనూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి బదులు ఆయన కుమారుడు మోహిత్‌రెడ్డి అభ్యర్థిగా ఉంటారని గతేడాదే పార్టీ ప్రకటించింది. మోహిత్‌కు గన్‌మెన్ సదుపాయం కల్పించింది. అధికారిక ప్రొటోకాల్ కోసం తుడా చైర్మన్‌నూ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీరిద్దరి పేర్ల ప్రకటన ఈ రెండు నియోజకవర్గాల్లో గానీ, ఉమ్మడి జిల్లావ్యాప్తంగానూ పెద్దగా చర్చ కూడా రాలేదు. మిగిలిన నియోజకవర్గాల ప్రస్తావన జాబితాలో లేకపోవడం మాత్రం జిల్లాలో తీవ్ర చర్చకు దారితీస్తోంది. సమన్వయకర్తలుగా ప్రకటించడమంటే ఆయా చోట్ల వారే రానున్న ఎన్నికల్లో అభ్యర్థులన్నది తెలిసిందే. ఈ క్రమంలో మిగతా నియోజకవర్గాల్లోని పలువురు ఎమ్మెల్యేల విషయంలో పార్టీ పునరాలోచనలో ఉందన్న ప్రచారంతో వారిలో ఆందోళన మొదలైంది. కాగా, మార్పులుంటేనే కొత్తగా సమన్వయకర్తలను నియమిస్తారని, తమ నియోజకవర్గాల్లో మార్పులు లేవు కాబట్టి వారిని నియమించే ప్రసక్తి లేదని తమ అనుచరవర్గాల ఎదుట సిట్టింగులు బింకం ప్రదర్శిస్తున్నట్లు సమాచారం.

కాంగ్రెస్ వైపు ఇద్దరు సిటింగుల చూపు!

అవమానించిన అధినేతకు తగిన బుద్ధి చెప్పేందుకు రగిలిపోతున్న వైనం

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు సిటింగు ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారు. అధికార పార్టీలో తమకు జరుగుతున్న అవమానానికి రగిలిపోతున్న ఆ ఇద్దరూ ప్రతీకారం తీర్చుకునేలా అధినేతకు తగిన బుద్ధి చెప్పాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ దిశగా పయనించేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటూ సమాయత్తమవుతున్నట్లు వారి సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. అదే జరిగితే ఉమ్మడి జిల్లాలో ప్రాభవం కోల్పోయిన కాంగ్రెస్ పార్టీకి తిరిగి ప్రాణం పోయడంలో వీరిదే తొలి అడుగు కానుంది.

● జిల్లాలో చెరో దిశగా ఉన్న రెండు నియోజకవర్గాల సిటింగ్ ఎమ్మెల్యేలకు వచ్చే ఎన్నికల్లో తిరిగి టికెట్ ఇవ్వడం లేదని అధినేత జగన్ స్పష్టత ఇచ్చేసినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. తూర్పు దిశగా ఉన్న నియోజకవర్గ ఎమ్మెల్యే అధికార పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. ఒకసారి ఓటమి చెందినా ఓపిగ్గా పార్టీలో కొనసాగారు. నిత్యం ప్రజల్లో వుంటూ రెండో పర్యాయం కిందటి ఎన్నికల్లో గెలుపొందారు. స్వతహాగా సౌమ్యుడని పేరుంది. కుటుంబసభ్యులొకరి తీరుతో పలువురు పార్టీ నాయకులు నొచ్చుకున్న మాట వాస్తవం. దానిపై ఫిర్యాదులు రావడంతో వారి జోక్యాన్ని దాదాపుగా తగ్గించేశారు. ఏవో గ్రామస్థాయి నిర్ణయాలు, అభివృద్ధి పనుల్లో మినహా ఆయన నిర్ణయాలేవీ చెల్లుబాటు కాలేదు. జిల్లాపై పెత్తనం చెలాయిస్తున్న ఓ మంత్రి నిర్ణయించిన మేరకే పదవులు సహా అధికారుల బదిలీలు వంటివి జరిగాయి. అయినా ఎన్నికలు సమీపించేసరికి సర్వేల్లో రిపోర్టులు బాగా రాలేదని, పార్టీ నాయకుల్లో వ్యతిరేకత వుందన్న కారణాలు చూపి టికెట్ తిరస్కరించినట్టు ప్రచారం జరుగుతోంది.

● ఇక ఉమ్మడి జిల్లా కేంద్రానికి చేరువగా వున్న నియోజకవర్గ సిట్టింగ్ ఎమ్మెల్యేది మరో దీనగాథ. ఆయన కూడా పార్టీలో ఆవిర్భావం నుంచీ వున్నారు. జడ్పీటీసీగా పోటీ చేసి ఓడిపోయారు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ దక్కింది. పారిశ్రామికవేత్త నేపథ్యం వుండడంతో సొంత ఆర్థిక వనరులు ఖర్చు పెట్టుకుని పోటీ చేశారు. పోలింగ్ రోజు టీడీపీ కంచుకోట వంటి ఓ గ్రామంలో పోలింగ్ కేంద్రానికి వెళ్ళి ఏకపక్ష ఓటింగ్ జరుగుతోందంటూ గొడవ చేశారు. ఆ క్రమంలో బ్యాలెట్ బాక్సులో నీరు పోసేశారు. దీంతో కోపోద్రిక్తులైన గ్రామస్తులు దాడి చేయడంతో ఆయన తీవ్రంగా గాయపడ్డారు. ఆరోగ్యం విషమించిన పరిస్థితుల్లో రోజుల తరబడి ఆస్పత్రి పాలై నెమ్మదిగా కోలుకున్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక కూడా జిల్లాలో ఆధిపత్యం వహిస్తున్న ఓ మంత్రి ఇష్టాఇష్టాలకు అనుగుణంగానే వ్యవహరిస్తూ వస్తున్నారు. వచ్చే ఎన్నికల్లో కూడా పార్టీ నిధులపై ఆధారపడకుండా సొంత నిధులు వెచ్చించేందుకు సంసిద్ధమయ్యారు. అయినా ఏవో కారణాలు చూపి అధినేత టికెట్ నిరాకరించినట్టు విస్తృత ప్రచారం జరుగుతోంది. ఈ ఎమ్మెల్యేకి పరిశ్రమలు, వ్యాపారాలపరంగా బెంగుళూరుతో సంబంధాలున్నాయి. అందులో భాగంగా అక్కడి రాజకీయ పార్టీల ముఖ్యనేతలతో సన్నిహిత పరిచయాలు పెంచుకున్నారు. ఇటీవల వచ్చిన పర్వదినాన కర్ణాటకలో కీలక పదవిలో వున్న కాంగ్రెస్ ముఖ్యనేత కుటుంబీకులను తిరుమలకు దర్శనానికి వెంట తీసుకెళ్ళినట్టు సమాచారం. టికెట్ విషయంలో అధినేత వ్యవహారశైలితో తీవ్ర అవమానానికి, మానసిక వేదనకు గురవుతున్నందున అధినేతకు కూడా అదేవిధమైన గుణపాఠం చెప్పాలని కర్ణాటక నేత ద్వారా కాంగ్రెస్‌లో చేరేందుకు సంసిద్ధమవుతున్నట్టు సమాచారం. తొలుత ప్రస్తావించిన సిటింగ్ కూడా ఇదే తీరులో ఆలోచిస్తూ కాంగ్రెస్‌కు చేరువయ్యేందుకు నిర్ణయించుకున్నట్టు తెలిసింది. వీరిని అధిష్ఠానం బుజ్జగించకపోయినా, లేక టికెట్లు ఖరారు చేయకపోయినా ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచీ కాంగ్రెస్‌లో చేరబోయే తొలి నేతలు వీరే కావడానికి అవకాశాలున్నాయి.

సీఎం వద్దకు చిత్తూరు పంచాయితీ

● జగన్‌ను కలిసిన ఎమ్మెల్యే ఆరణి, విజయానందరెడ్డి

చిత్తూరు, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థిత్వంపై పంచాయితీ సీఎం జగన్ వద్దకు చేరింది. టిక్కెట్ కోసం ప్రస్తుత ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి మధ్య పోటీ బలంగా ఉంది. ఇన్నాళ్లు ఇరువర్గాలు ఎమ్మెల్యే టికెట్టు నాకంటే నాకంటూ ప్రచారం చేసుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఆయా నియోజకవర్గాలకు ఇన్‌చార్జులను ప్రకటిస్తున్న నేపథ్యంలో మంగళవారం ఎమ్మెల్యే ఆరణితో పాటు విజయానందరెడ్డికి సీఎం కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. దీంతో వీరిద్దరూ తాడేపల్లి వెళ్లారు. ఇద్దరితోనూ సీఎం జగన్ సమావేశమయ్యారు. టికెట్ తనకే కన్‌ఫర్మ్ అయిందని విజయానందరెడ్డి చెబుతున్నారు. ఆయన వర్గీయులు, అభిమానులుమంగళవారం రాత్రి పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు. ఈ ఎన్నికల్లో విజయానందరెడ్డి గెలుపు కోసం పనిచేయాలని, ప్రభుత్వం వచ్చాక రాజ్యసభకు అవకాశం ఇస్తానని ఆరణికు సీఎం హామీ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, మంగళవారం ప్రకటించిన 27 మంది ఇన్‌చార్జుల జాబితాలో చిత్తూరు ప్రస్తావన లేదు. రెండు రోజుల్లో వచ్చే మరో జాబితాలో విజయానందరెడ్డి పేరుంటుందని ఆయన వర్గీయులు ప్రచారం చేస్తున్నారు.



సీఎం జగన్‌ను కలిసిన విజయానందరెడ్డి, మిథున్‌రెడ్డి

డిప్యూటీ సీఎంకు అంగన్వాడీల నిరసన సెగ

కార్వేటినగరం, జనవరి 2: తన సొంత మండలమైన కార్వేటినగరంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామికి అంగన్వాడీల నుంచి నిరసన సెగ తగిలింది. మంగళవారం ఇక్కడి ఎంపీడీవో కార్యాలయంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పాల్గొంటున్న సందర్భంగా, అక్కడ 20 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్వాడీల శిబిరాన్ని ధర్మరాజుల గుడి వద్దకు మార్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన డిప్యూటీ నారాయణస్వామికి వినతిపత్రం అందజేయడానికి అంగన్వాడీలు వెళ్లగా, ఆయన తీసుకోకుండానే ఎంపీడీవో కార్యాలయం లోపలకు వెళ్లిపోయారు. కార్యక్రమం ముగించుకుని డిప్యూటీ సీఎం కాన్వాయ్‌లో బయటకు వెళుతుండగా, అంగన్వాడీలు పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ఎంపీడీవో కార్యాలయ ప్రవేశ ద్వారం వద్ద రోడ్డుపై బైఠాయించారు. డిప్యూటీ సీఎం కాన్వాయ్‌ని వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో డిప్యూటీ సీఎం కారు దిగి అంగన్వాడీ సమస్యలకు సంబంధించిన వినతి పత్రాన్ని తీసుకున్నారు. సీఎం దృష్టికి సమస్యను తీసుకెళ్తానని వారికి హామీ ఇచ్చారు.



డిప్యూటీ సీఎం నారాయణస్వామి కాన్వాయ్‌ను అడ్డుకున్న అంగన్వాడీలు



కుప్పంలో దున్నపోతుకు వినతిపత్రం ఇస్తున్న అంగన్వాడీలు

దున్నపోతుకు వినతిపత్రం

● అంగన్వాడీల వినూత్న నిరసన

చిత్తూరు, జనవరి 2: తాము 22 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అంగన్వాడీలు ఆగ్రహించారు. కుప్పంలో మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం ఇచ్చి వినూత్న తరహాలో నిరసన తెలిపారు. చిరుద్యోగుల ఆకలి కేకలు, న్యాయమైన డిమాండ్లను కనీసం వినడానికి ఇష్టపడని ప్రభుత్వానికంటే దున్నపోతు నయమని యూనియన్ నాయకులు పేర్కొన్నారు. చిత్తూరులో, పలమనేరులో దీక్షా శిబిరాల వద్ద అంగన్వాడీలు నిరసన చేపట్టారు. పుంగనూరు సీడీపీవో కార్యాలయం వద్ద అంగన్వాడీలు ధర్నా చేశారు. ఇలా జిల్లాలోని సీడీపీవో, ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టారు.

పంటలపై గజదాడులు



కూనపల్లి వద్ద కొబ్బరిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు

కల్లూరు, జనవరి 2: పులిచెర్ల మండలంలో సుమారు ఆరు నెలలుగా వ్యవసాయ పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతున్నాయి. కావేటిగారిపల్లి పంచాయతీ కూనపల్లి సమీపంలోని పంటలపై మూడు రోజులుగా ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. సోమవారం రాత్రి కూనపల్లికి చెందిన కొక్కే గోవిందయ్య పొలంలోని 20 ఏళ్ల కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో ఏనుగుల గుంపు పెకలిం చాయి. సమీపంలోని తమలపాకు తోటను ఏనుగులు తొక్కేశాయి. ఉదయం పొలంవద్దకు వెళ్లిన రైతుకు పంటలపై ఏనుగులు చేసిన దాడులను చూసి ఆందోళన వ్యక్తం చేశారు. కొమ్మిరెడ్డిగారిపల్లి నుంచి దామల్ చెరువుకు వెళ్లే రహదారిపైకి చేరుకున్న ఏనుగుల గుంపు ఘీంకారంతో వాహనదారులు భయపడి వెనక్కు వెళ్లిపోయారు. సుమారు 10 ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేసినట్లు రైతులు తెలిపారు.

పెట్రోల్ బంక్‌లో ముసుగు దొంగల హల్‌చల్

రూ.2.4 లక్షల చోరీ



శ్రీరంగరాజపురం, జనవరి 2: శ్రీరంగరాజపురం మండలంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో ముసుగు దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఎస్‌ఐ షేక్షావల్లి తెలిపిన ప్రకారం.. ఇండియన్ పెట్రోల్ బంక్‌లో తలుపులు పగులగొట్టి సోమవారం రాత్రి ముసుగు వేసుకున్న దుండగులు రూ.2.40 లక్షలు చోరీ చేశారు. లక్ష్మీపురంలోని పెట్రోల్ బంకులోనూ చోరీకి ప్రయత్నించినట్లు నిర్వాహకులు తెలిపారు. పెట్రోల్ బంక్ యజమాని గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

తిరుమల ఘాట్‌లో వాహనం బోల్తా

తమిళనాడు భక్తులకు స్వల్పగాయాలు



తిరుమల, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): తిరుమల రెండో ఘాట్‌లో మంగళవారం రాత్రి ఓ వాహనం బోల్తా పడింది. తమిళనాడుకు చెందిన ఆరుగురు భక్తులు శ్రీవారి దర్శనం కోసం టీఎన్ 22 బీఈ 2526 నెంబరు గల బొలెరో వాహనంలో తిరుమలకు బయల్దేరారు. రెండో ఘాట్‌లోని హరిణి ప్రాంతం సమీపంలో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. ఈప్రమాదంలో భక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.







మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు ఖాళీగా ఉన్న మూడు మహాప్రస్థానం వాహనాలు - అదే సమయంలో మృతదేహాలను తీసుకెళ్లడానికి ఎంఎం వార్డు, అత్యవసర విభాగం ముందున్న ప్రైవేటు అంబులెన్సులు


ప్రైవేటు అంబులెన్స్‌లదే హవా

రుయాస్పత్రిలో మహాప్రస్థానం వాహనాలుండీ ఉపయోగమేమి?

తిరుపతి సిటీ, జనవరి 2: రుయాస్పత్రిలో మృతదేహాలను ఉచితంగా తరలించడానికి నాలుగు మహాప్రస్థానం వాహనాలున్నాయి. ఏజెన్సీ తరపున నిర్వహించే ఈ వాహనాలకు నెలకు రూ.లక్ష చొప్పున రూ.4 లక్షలు బిల్లులైతే చెల్లిస్తున్నారు. అయినా ఇక్కడ ప్రైవేటు అంబులెన్స్‌ల నిర్వాహకుల హవానే నడుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం మూడు గంటలకు మూడు మహాప్రస్థానం వాహనాలు అందుబాటులో ఉన్నాయి. అదే సమయంలో ఎంఎం వార్డు, అత్యవసర విభాగం నుంచి మృతదేహాలను తీసుకెళ్లడానికి ప్రైవేటు అంబులెన్స్‌లను బాధితులు ఆశ్రయించాల్సి వచ్చింది.

కమీషన్ల కోసమేనా?

ఆస్పత్రిలో రోజూ చికిత్స పొందుతూ ఏడు నుంచి తొమ్మిది మంది మృతి చెందుతుంటారు. ఇలా చనిపోయిన వారి వివరాలను వార్డులోని స్టాఫ్‌నర్సు, డాక్టరు వెంటనే మహాప్రస్థానం నిర్వాహకులకు తెలియజేయాలి. అలాగే ఉచితంగా మృతదేహాలను తీసుకెళ్లడానికి మహాప్రస్థానం వాహనాలు ఉన్నట్లు బాధితులకు తెలిసేలా బోర్డులు పెట్టాలి. అటువంటివేమీ ఇక్కడ కనిపించవు. మహాప్రస్థానం వాహనాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు వంటివి ఎక్కడన్నా చిన్నపాటి కాగితంపై చేతితో రాసి ఉంచుతున్నారు. ఎవరన్నా గుర్తించి అడిగితే వాహనాలు దూరంలో ఉన్నాయని, వచ్చేందుకు సమయం పడుతుందని అక్కడున్న సిబ్బంది చెబుతారు. అనంతరం ప్రైవేటు అంబులెన్స్‌లను రప్పించి, బాధితులకు సాయం చేస్తున్నట్లుగా నమ్మిస్తున్నారు. దీనికంతటికీ కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారులతోపాటు మహాప్రస్థానం వాహనాల నిర్వాహకులకు కూడా కమీషన్లు అందుతున్నాయన్న ఆరోపణలున్నాయి.



మార్చురీ వద్ద చిత్తు కాగితంపై రాసి అతికించిన మహాప్రస్థానం వాహన వివరాలు, డ్రైవర్ల ఫోన్ నెంబర్లు

పోలింగ్ స్టేషన్లవారీగా వసతుల కల్పనపై నివేదిక ఇవ్వండి

అధికారులకు కలెక్టర్ ఆదేశం

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 2: త్వరలో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పోలింగ్ స్టేషన్లవారీగా వసతుల కల్పనపై పూర్తినివేదికను అందజేయాలని పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులను కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. దీనిపై మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో వివిధశాఖల అధికారులతో సమీక్షించారు. అవసరమైన ఫర్నిచర్, విద్యుద్దీకరణ, మరుగుదొడ్ల ఏర్పాటు, ర్యాంపుల నిర్వహణ తదితరాలపై శుక్రవారంలోగా నివేదిక అందజేయాలని పీఆర్ ఎస్‌ఈ చంద్రశేఖర్‌ను ఆదేశించారు. పీవో, ఏపీవో, సెక్టోరల్ అధికారుల నియామకాలకోసం సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది వివరాలను అందజేయాలన్నారు. సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని, డీఈవో విజయేంద్రరావు, డీఎల్డీవో రవికుమార్, చిత్తూరు, పలమనేరు, కుప్పం, నగరి ఆర్డీవోలు చిన్నయ్య, మనోజ్‌కుమార్ రెడ్డి, శ్రీనివాసులు, సుజన, చిత్తూరు, పుంగనూరు, పలమనేరు మున్సిపల్ కమిషనర్లు అరుణ, నరసింహప్రసాద్, కిరణ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమీక్షలు - సమావేశాలు

'స్వీప్ యాక్టివిటీస్'పై సమావేశం: కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో ఈ సమావేశం జరిగింది. పోలింగ్ సరళిపై అవగాహన కల్పించేందుకు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు 25న మాక్‌పోల్ నిర్వహించాలని కలెక్టర్ షన్మోహన్ సూచించారు. కళాశాల స్థాయిల్లో ఎలక్ట్రోల్ లిటరసీక్లబ్‌లు ఏర్పాటు చేసి, యువఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టిపెట్టాలన్నారు.

పాఠశాలల్లో వసతులు ఏర్పాటు చేయాలి

చిత్తూరు (సెంట్రల్): ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని డీఈవో విజయేంద్రరావు, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. చిత్తూరులోని పీసీఆర్‌లో ఎక్కడైనా పెండింగ్‌లో ఉంటే వెంటనే పూర్తి చేయాలన్నారు.

బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం

చిత్తూరు కలెక్టరేట్: వ్యవసాయ రంగాభివృద్ధికి మరింత సహకారమందిస్తూ రుణాలు అందించాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి బ్యాంకర్ల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. వైఎస్సార్ పంటల బీమా సౌకర్యం కల్పించేందుకు ముందుకు రావాలని, ఖాతాదారులకు రుణాలిచ్చేందుకు గ్రామాలవారీ వివరాలు సేకరించాలన్నారు. సమావేశంలో ఆర్బీఐ ప్రతినిధి నాగప్రవీణ్, నాబార్డు డీడీఎం సునీల్, ఇండియన్ బ్యాంకు జడ్‌ఎం రాజేష్, డీఆర్డీఏ పీడీ తులసి, మెప్మా పీడీ రాధమ్మ, పశుసంవర్థకశాఖ జేడీ ప్రభాకర్, వ్యవసాయశాఖ అధికారి మురళీకృష్ణ, డీఐసీ జీఎం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ భవన్ కోసం నిరసన దీక్ష



వి.కోట, జనవరి 2: వి.కోటలో అర్ధంతరంగా ఆగిన అంబేడ్కర్ భవన్‌ను పూర్తి చేయాలని దళిత సంఘాలు డిమాండు చేశాయి. మంగళవారం ఉదయం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసిన అనంతరం సామూహిక నిరసన దీక్ష చేపట్టారు. టీడీపీ హయాంలో ప్రభుత్వ బాలుర పాఠశాల వద్ద 28 సెంట్లలో అంబేడ్కర్ భవన్ నిర్మాణానికి టెండర్లు పిలిచారన్నారు. పునాదులు వేశారని తెలిపారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ.. దీని నిర్మాణం ఊసే ఎత్తకపోవడం బాధాకరమన్నారు. దళితుల ఓట్లతో గద్దెనెక్కి, ఆపై విస్మరిస్తున్న వారికి ఓటుతోనే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. మండలంలో 22 వేలకుపైగా దళిత ఓటర్లు ఉన్నారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ అంబేడ్కర్ సేన నేతలు గణపతి, వినోద్, శివరాం, విశ్వనాథ్, గిరిబాబు, సుబ్రమణ్యం, గుర్రప్ప, శంకరావు, సేరేంద్ర, తంగరాజ్, మునిరత్నం, తాము, గౌతమ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు

తిరుమల, జనవరి2(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.97 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 63,358 మంది భక్తులు స్వామినిదర్శించుకున్నారు.19,534మంది శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

జనసేన నేత పిటిషన్‌పై
కౌంటర్ దాఖలు చేయండి

కిరణ్ రాయల్ కేసులో పోలీసు శాఖను ఆదేశించిన హైకోర్టు - తదుపరి విచారణ 9కి వాయిదా

తిరుపతి, జనవరి 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి రోజాను విమర్శించారంటూ జనసేన తిరుపతి ఇంఛార్జి కిరణ్ రాయల్‌పై కేసు నమోదు చేసిన నగరి పోలీసులు ఆయనకు సంబంధించిన మొబైల్ ఫోన్ల నుంచీ డేటా చౌర్యానికి పాల్పడ్డారంటూ దాఖలైన రిట్ పిటిషన్‌ను హైకోర్టు మంగళవారం విచారణకు స్వీకరించింది. దీనిపై వారంలోగా కౌంటర్ దాఖలు చేయాలని హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. వివరాల్లోకి వెళితే...తిరుపతి జనసేన ఇంచార్జి కిరణ్ రాయల్ 2022 అక్టోబరు 16న మీడియా సమావేశంలో మంత్రి రోజాపై విమర్శలు చేశారు. ఇవి అనుచిత విమర్శలంటూ నగరి, పుత్తూరుల్లో వైసీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో ఆయనపై అదే నెల 18న కేసు నమోదైంది.నవంబరు 11న ఈ కేసులో నగరి పోలీసులు తిరుపతిలో కిరణ్ రాయల్‌ను ఆయన ఇంటిలో వుండగా అదుపులోకి తీసుకుని నగరికి తరలించి మరుసటి రోజు అక్కడి కోర్టులో హాజరుపరిచారు. కాగా కిరణ్ రాయల్‌ను అదుపులోకి తీసుకున్నపుడు ఆయనకు, ఆయన సతీమణికి చెందిన రెండు మొబైల్ ఫోన్లను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఆయన పోలీసు కస్టడీ నుంచీ విడుదలయ్యాక నవంబరు 23న పోలీసుల స్వాధీనంలో వున్న తన మొబైల్ ఫోన్లను తిరిగి అప్పగించాల్సిందిగా కోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై కోర్టు మొబైల్ ఫోన్ల నుంచీ ఎలాంటి సమాచారం ఇతరులకు లీక్ చేయకూడదంటూ పోలీసులను ఆదేశించింది. కిరణ్ రాయల్ హైకోర్టును ఆశ్రయించడంతో అతనిపై నమోదు చేసిన సెక్షన్ 294 మినహా మిగిలిన సెక్షన్లను కొట్టివేసింది. అదే సమయంలో సాక్ష్యాధారాల కింద తీసుకున్న అతని రెండు మొబైల్ ఫోన్ల నుంచీ మంత్రి రోజా గురించి మాట్లాడిన వీడియో మినహా మరే ఇతర సమాచారం సేకరించరాదని ఆదేశించింది. ఫోన్ల నుంచీ కేసుకు అవసరమైన డేటాను ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచీ మాత్రమే సేకరించాలని ఆదేశించింది. హైకోర్టు ఆదేశాల మేరకు నగరి కోర్టు సంబంధిత మొబైళ్లను భద్రపరచాలని,దాని నుంచీ ఎవరూ ఎలాంటి సమాచారం సేకరించకుండా కట్టడి చేయాలని కోర్టులో సంబంధిత ప్రాపర్టీ క్లర్కును ఆదేశించింది. అయితే కోర్టు అనుమతి లేకుండా పోలీసులు మొబైల్ ఫోన్లను తీసుకెళ్ళినట్టు తేలడంతో కలకలం రేగింది.ఈ నేపథ్యంలో కిరణ్ రాయల్ తాజాగా హైకోర్టును ఆశ్రయించారు. తన ఫోన్ల నుంచీ పోలీసులు డేటా చౌర్యానికి పాల్పడ్డారని, అందులోని ఫోటోలను మార్ఫింగ్ చేసి సోషల్ మీడియాలో పెడతామని బెదిరిస్తున్నారంటూ తన రిట్ పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రజా సమస్యలు లేవనెత్తుతున్న ప్రతిపక్ష నేతల ఫోన్ల నుంచీ డేటా దొంగిలించడం గోప్యతా హక్కును హరించడమేనని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ ఆయన హైకోర్టును కోరుతూ గత నెల 27వ తేదీన రిట్ పిటిషన్ దాఖలు చేయగా 29వ తేదీన పిటిషన్ రిజిస్టరై (రిట్ పిటిషన్ నంబరు 33578-2023) మంగళవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన జడ్జి జస్టిస్ భానుమతి వారంలోగా కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా హోంశాఖ జీపీని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 9వ తేదీకి వాయిదా వేసింది. ఈ కేసులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నగరి డీఎస్పీ రవికుమార్, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, మునుపటి నగరి సీఐ, ప్రస్తుత నింద్ర సీఐ శ్రీనివాసంతి, నగరి అర్బన్ పోలీస్ స్టేషన్ కోర్టు కానిస్టేబుల్ రాజశేఖర్‌లను కిరణ్ రాయల్ ప్రతివాదులుగా పేర్కొన్నారు. కాగా కిరణ్ రాయల్ తరపున న్యాయవాది పి.వి.జి. ఉమేష్ చంద్ర కేసు వాదిస్తున్నారు.

గుప్తనిధుల కోసమే ఆలయాల కూల్చివేత

- ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహం మాయం
- వైసీపీ నేతలపై సుధీర్ రెడ్డి ఫైర్

శ్రీకాళహస్తి జనవరి 2: గుప్త నిధుల కోసమే వైసీపీ నేతలు ఆలయాలను కూల్చి వేస్తున్నారని... ముక్కంటి ఆలయంలో లక్ష్మీదేవి విగ్రహాన్ని మాయం చేశారని టీడీపీ ఇంచార్జ్ బొజ్జల సుధీర్ రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని మృత్యుంజయ సన్నిధి పక్కన ఉన్న గోడల కూల్చివేతపై మంగళవారం సుధీర్ రెడ్డి టీడీపీ నేతలతో కలిసి ఆలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..శ్రీకాళహస్తిలో వరదరాజస్వామి అల యం కూల్చివేసిన సమయంలోనే గుప్త నిధులను హైదరాబాద్‌లో ఎమ్మెల్యే విక్రయిస్తున్నట్లు వెల్లడించానన్నారు.దీంతో తన మీద రూ.2 కోట్లకు పరువు నష్టం దావా వేశారని గుర్తు చేశారు. విజ్ఞానగిరి వద్ద వినాయక స్వామి ఆలయం, ఊరందూరులో నీలకంఠేశ్వరాలయం, ఏడు గంగమ్మ ఆలయాలను పునర్నిర్మాణాల పేరుతో కూల్చివేశారన్నారు. ఇవన్నీ గుప్త నిధుల కోసమే ధ్వంసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద గోడలు కూల్చివేసిన ప్రదేశంలో ఉన్న లక్ష్మీదేవి విగ్రహాన్ని మా యం చేశారని ఆరోపించారు.దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ అధికారంలోకి రాక ముందు రూ.200కోట్లకు పైగా నిధులు ముక్కంటి ఆలయానికి ఉన్నాయన్నారు. ప్రస్తుతం రూ.20కోట్లు ఉంచి మిగతాది స్వాహా చేసేయడం బాధాకరమన్నారు.పురాతన కట్టడాలు ఎందుకు కూల్చి వేస్తున్నారని ఈవో రామారావును అడిగితే హాస్యాస్పదంగా సమాధానం ఇచ్చారని చెప్పారు. వా రం రోజుల్లో ఆలయంలోని టికెట్ కౌంటర్లు, లడ్డు పోటు, అన్నదానం స్టోర్, ఇంజనీరింగ్ విభాగం, నిధుల దుర్వినియోగం, ఉద్యోగుల బదిలీల్లో అవినీతి, గోశాలలో కుంభకోణం అన్ని అంశాలపై తిరుపతిలో విలేకరుల సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను బహిర్గతం చేస్తానన్నారు.ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలిలో రౌడీలకు స్థానం కల్పించడం సిగ్గు చేటన్నారు. మండలిలోని ఓ ప్రత్యే క ఆహ్వానితుడు సోమవారం రాత్రి ఇద్దరిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనను ఇందుకు ఉదాహరణగా ఆయన చెప్పారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి



అర్ధనగ్నంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

కుప్పం, జనవరి 2: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని మున్సిపల్ కార్మికులు డిమాండ్ చేశారు. కుప్పంలో మున్సిపల్ కార్మికులు సమ్మెలోకి దిగారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించలేదన్న కారణంతో ప్రభుత్వంపై వారు నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట దీక్షా శిబిరం ఏర్పాటు చేసి ఆందోళన బాట పట్టారు. మంగళవారం అర్ధనగ్నంగా మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కార్మిక నేతలు మాట్లాడుతూ కాంట్రాక్టు ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతేగాక ఇతర ఉద్యోగులతో సమానంగా అన్నిరకాల ప్రయోజనాలను కల్పించాలని కోరారు. ఎర్ర జెండాలు పట్టుకుని నినాదాలు చేశారు.

నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా పింఛన్ల పంపిణీ

పలమనేరు, జనవరి2 : ఈ నెల 3వ తేదీ పలమనేరు నియోజకవర్గంలోని వి.కోట, పలమనేరు మున్సిపాలిటీ, పెద్దపంజాణి మండలాల్లో ఎమ్మెల్యే వెంకటేగౌడ చేతుల మీదుగా పింఛను పంపిణీ చేయనున్నారు. పింఛను రూ.3వేలకు చేరడంతో ఈ మేరకు పంపిణీ చేయనున్నారు. పెరిగిన పెన్షన్ లబ్ధిదారులతో పాటు కొత్త వారికి కూడా ఈ కార్యక్రమంలోనే పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు. వి.కోట ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 9.30 గంటలకు, పలమనేరు మున్సిపల్ కార్యాలయం వద్ద సాయంత్రం 3 గంటలకు, పెద్దపంజాణి తహసీల్దార్ కార్యాలయం వద్ద సాయంత్రం 4గంటలకు పెన్షన్ పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు.

పోటాపోటీగా గ్రామాల్లో వెలుస్తున్న చిట్లా కుప్పలు



సోమల ఎగువవీధికి చెందిన చిట్లా కుప్ప వేస్తున్న రైతన్నలు

సోమల, జనవరి 2: సంక్రాంతి పండుగ వేడుకల్లో భాగంగా కాటమరాజు ఆలయాల వద్ద చిట్లా కుప్పలు వేయడంలో రైతులు పోటీలు పడుతున్నారు. కాటమరాజు ఆలయాల వద్ద ముమ్మరంగా పనులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మంగళవారం ఎగువవీధికి చెందిన రైతులు ఆలయం వద్దకు చేరుకుని చిట్లా కుప్పలు చేశారు. అక్కడి ఆలయం వద్ద ఏర్పాట్లు చేపట్టారు. మకర సంక్రాంతి రోజున పశువులను ఆలయం వద్దకు తీసుకెళ్లి పూజలు చేసి చిట్లా కుప్పల చుట్టూ ప్రదక్షిణలు చేయించడం ఆనవాయితీ. గన్నావారిపల్లె, దిడ్డివారిపల్లె, రాశెట్టివారిపల్లెలో చిట్లా కుప్పలు వేశారు.

నంజంపేట మార్గంలో పొంచి ఉన్న ప్రమాదం



సోమల - నంజంపేట మార్గంలో ఉన్న ప్రమాదకర మలుపు

సోమల, జనవరి 2: సోమల - నంజంపేట మార్గంలోని దిగువకుంట కట్టపై ప్రమాదకర మలుపు ఉండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మంగళవారం నంజంపేట మార్గం నుంచి సోమలకు వస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి దిగువకుంటలోకి దూసుకెళ్లింది. సమీప రైతులు వారిని, ద్విచక్రవాహనాన్ని బయటకు లాగారు. ఈ మార్గం లోనే పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, పొదల గుంట్లపల్లె, చిన్నఉప్పరపల్లె, పేటూరు, నంజంపేట, సదుం మండలానికి చెందిన నాయనపాకాల, చెరుకువారిపల్లె ప్రాంతాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గతంలోనూ ఈ మలుపులో పలు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఆర్‌అండ్‌బీ అధి కారులు స్పందించి మలుపులో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలని, దిగువకుంట కట్ట వెడల్పు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రజల ఆరోగ్యరక్షణపై ప్రత్యేక శ్రద్ధ: ఎంపీ రెడ్డెప్ప



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రెడ్డెప్ప

బైరెడ్డిపల్లె, జనవరి 2 : ప్రజల ఆరోగ్యరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటున్నట్లు చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప అన్నారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం వైద్యశిబిరానికి వచ్చిన వారికి మెడికల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీచైర్మన్ శ్రీనివాసులు, బైరెడ్డిపల్లె ఎంపీపీ రెడ్డెప్ప, సర్పంచ్ వెంకటేష్, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి కృష్ణమూర్తి, ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, వైద్యాధికారి విజయచందర్, గ్రామకార్యదర్శి సదాశివయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు వైసీపీ ఆర్థికసాయం



వర్తికుప్పంలో మృతుడి కుటుంబసభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

రామకుప్పం, జనవరి 2: రామకుప్పం మండలం తగరాలతాండా, వర్తికుప్పంలకు చెందిన వైసీపీ కార్యకర్తలు కృష్ణవేణి, జబ్బార్‌బాషాలు మంగళవారం అనారోగ్యంతో మృతిచెందారు. ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డి, వైసీపీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురంబాబు, చంద్రారెడ్డి, ప్రచారక్యాదర్శి కేశవరెడ్డి, సర్పంచులు రాజగోపాల్, ఆనంద్, పలువురు నేతలు వారి మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. మృతుల కుటుంబసభ్యులకు పార్టీ తరఫున రూ.10వేలు చొప్పున ఆర్థికసాయం అందజేశారు.

వైసీపీ మండల ప్రధాన కార్యదర్శిగా మోహన్‌నాయక్



రామకుప్పం, జనవరి 2: వైసీపీ రామకుప్పం మండల ప్రధాన కార్యదర్శిగా వీర్నమల పెద్దతాండా సర్పంచు మోహన్‌నాయక్ నియమితులయ్యారు. తనను నియమించిన మంత్రి పెద్దిరెడ్డి, ఎమ్మెల్సీ భరత్‌కు, సహకరించిన పార్టీ మండల కన్వీనర్, కో-కన్వీనర్లు విజలాపురం బాబు, చంద్రారెడ్డి, ఎంపీపీ సుబ్రహ్మణ్యం, జడ్పీటీసీ నితిన్‌రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం ఒకరి అరెస్టు

పుంగనూరు రూరల్, జనవరి2: కర్ణాటక మద్యం తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. హెడ్‌కానిస్టేబుల్ వెంకట్రమణ కథనం మేరకు.. పట్టణంలోని తూర్పుమొగసాలకు చెందిన నారాయణ మంగళవారం రాత్రి కర్ణాటక రాష్ట్రం నుంచి 20 మద్యం ప్యాకెట్లు తీసుకువస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేశారు.

గడ్డివామి దగ్ధం



చౌడేపల్లె, జనవరి2: పాడి ఆవుల కోసం నిల్వ ఉంచిన గడ్డివామి దగ్ధమైంది. మండలంలోని అంకుతోటపల్లెకు చెందిన వెంటకరమణ తన ఇంటి వద్ద ఆవుల కోసం రూ..20 వేలు విలువచేసే వరి గడ్డిని నిల్వ ఉంచారు. గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్లు కాల్చి ఆ మంటను ఆర్పకుండా పడేయడంతో గడ్డివామికి నిప్పు రాజుకుంది. అగ్నిమాపక శాఖ అధికారి సుబ్రహ్మణ్యంరాజు ఆధ్వర్యంలో సిబ్బంది మంటలు అదుపుచేసేలోపు వామి దగ్ధమైంది. అయితే చుట్టు పక్క ఇళ్లకు మంటలు వ్యాపించకుండా అదుపుచేయడంతో ప్రమాదం తప్పింది. ఈ కార్యక్రమంలో సుమన్, ఇమ్మానుయేల్, కేశవ తదితరులు పాల్గొన్నారు.

యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడిగా పూలచైతన్యమోహన్



పలమనేరు, జనవరి2 : యువకాపునాడు రాష్ట్ర అధ్యక్షుడిగా పలమనేరుకు చెందిన పూలచైతన్య మోహన్ నియమితులయ్యారు. ఆమేరకు గుంటూరులో జరిగిన కార్యక్రమంలో కన్నా లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని పూల చైతన్యమోహన్‌కు అందజేశారు.

చప్పిడిపల్లెలో భారత్ సంకల్పయాత్ర

బైరెడ్డిపల్లె, జనవరి 2 : మండలంలోని చప్పిడిపల్లె గ్రామంలో మంగళవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ పథకాలైన ఆయుష్మాన్ భారత్, ప్రధాన మంత్రి మాతృవందన యోజన, ప్రధానమంత్రి సురక్షిత మాతృఅభియాన్, టీబీ ముక్తభారత్, జనని సురక్ష యోజన గురించి ఆరోగ్యవిద్యాధికారి సావిత్రి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్డుదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి



రామకుప్పం, జనవరి 2: నిత్యావసరాల పంపిణీ విషయంలో ఎండీయూ ఆపరేటర్లు కార్డుదారులకు ఇబ్బంది లేకుండా చూడాలని తహసీల్దారు మురళి కోరారు. మంగళవారం రామకుప్పంలో నిత్యావసరాల పంపిణీ తీరును ఆయన పరిశీలించారు. పలువురు కార్డుదారులకు ఆయన తన చేతుల మీదుగా నిత్యావసరాలను అందజేశారు.

బందార్లపల్లెలో జగనన్న సురక్ష



ఆరోగ్య సూచనలు అందజేస్తున్న వైద్యాధికారి దీప

రామకుప్పం, జనవరి 2: రామకుప్పం మండలం బందార్లపల్లె-1 సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 108మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ హరినాథరెడ్డి, ఎంపీడీవో రాధాకృష్ణ, వైద్యాధికారులు లోకేష్, దీప, సర్పంచు రాజగోపాల్, నేతలు సుగుణప్ప, కేశవరెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



సదుం, జనవరి 2: మండలంలోని గొంగివారిపల్లెకు చెందిన కుమారస్వామికి సీఎం సహాయ నిధి రూ.50 వేల ఆర్థిక సాయాన్ని జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి అందజేశారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కుమారస్వామి వైద్య చికిత్స కోసం ఆర్థికసాయం కోరుతూ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి విన్నవించారు. స్పందించిన మంత్రి, సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఆర్థిక సాయానికి సిఫార్సు చేసినట్లు గ్రామ సర్పంచు నారాయణరెడ్డి తెలిపారు.

సీఎం స్పందించే వరకు పోరాటం ఆగదు

- సమ్మె కొనసాగిస్తున్న అంగన్వాడీలు
- కుప్పంలో దున్నపోతుకు వినతిపత్రం
- పలమనేరులో హమాలీల సంఘీభావం

కుప్పం, జనవరి 2: ప్రభుత్వం తీవ్రమైన ఆగ్రహావేశాలతో ఓపిక నశించిన అంగన్వాడీలు, కుప్పంలో మంగళవారం దున్నపోతుకు వినతిపత్రం సమర్పించారు. సమ్మెలో ఉన్న అంగన్వాడీలు స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట దీక్షలు చేస్తున్న విషయం తెలిసిందే. రకరకాల రూపాలలో వారి ఆందోళనలు సాగుతున్నాయి. ప్రభుత్వం మొద్దు నిద్ర వీడి, తమ సమస్యలపట్ల, సమ్మె పట్ల స్పందించాలని కోరుతూ అనేకరకాలైన ప్రదర్శనలతో వినూత్న రీతిలో పోరాడుతున్నారు. ఈ క్రమంలో కుప్పంలోని అంగన్వాడీలు మంగళవారం యథావిధిగా దీక్షా శిబిరంలో ఆందోళనలకు దిగారు. కొద్దిసేపటి తర్వాత తమ డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రం తయారు చేశారు. ఈ వినతిపత్రం తీసుకుని ఏమీ పట్టనట్లు కూచుని హాయిగా నెమరు వేసుకుంటున్న దున్నపోతు దగ్గరకు వెళ్లి దానికి అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు లలిత మాట్లాడుతూ చిరుద్యోగుల ఆకలి కేకలు, న్యాయమైన డిమాండ్లను కనీసం వినడానికి ఇష్టపడని ప్రభుత్వానికంటే దున్నపోతు నయమని పేర్కొన్నారు. అందుకే దున్నపోతుకు వినతిపత్రం సమర్పించి నిరసన తెలిపామని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన ప్రభుత్వం, తమను ఉద్యోగాల నుంచే తీసి వేయాలన్న కుట్రలు పన్నుతోందని, అదే జరిగితే పాలకుల అంతు చూస్తామని హెచ్చరించారు.

పలమనేరు: అంగన్వాడీల సమ్మెకు పలమనేరు హమాలీ యూనియన్ నాయకులు మంగళవారం సంఘీభావం తెలిపారు. మంగళవారం ఆమేరకు వారు అంగన్వాడీలకు శిబిరం వద్దకు వెళ్లి మద్దతు ప్రకటనించారు. ఈ సందర్భంగా హమాలీ యూనియన్ కార్యదర్శి శంకర్, ఉపాధ్యక్షులు జైచంద్ర తదితరులు మాట్లాడుతూ అంగన్వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీల ఆందోళనతో పౌష్టికాహార పంపిణీ ఆగిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఓబుల్‌రాజు, గిరిధరగుప్తా, అనసూయ, లత, ధనమ్మ, గాయత్రి, నీరజ, తదితరులు పాల్గొన్నారు.

పుంగనూరు రూరల్: సీఎం జగన్ తమ సమస్యల పరిష్కారం పట్ల స్పందించే వరకు పోరాటం ఆగదని అంగన్వాడీలు స్పష్టం చేశారు. నిరవధిక సమ్మెలో భాగంగా పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు బైఠాయించి ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు సరళ, మీనా, రమణమ్మ, సునీత, కుమారి, ధనలక్ష్మి, వాణి తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లె గ్రామ సచివాలయంవద్ద అంగన్వాడీలు సమ్మె కొనసాగించారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు తమ ఆందోళన విరమించేదిలేదని వారు స్పష్టం చేశారు.



కుప్పం దీక్షా శిబిరంలో నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు







పుంగనూరు, బైరెడ్డిపల్లెల్లో అంగన్వాడీల నిరసన, పలమనేరులో సంఘీభావం తెలుపుతున్న హమాలీ యూనియన్ నాయకులు

వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిక



వైసీపీ నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న అమరనాథరెడ్డి

పలమనేరు, జనవరి2 : ఇంటింటా తెలుగుదేశం, బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని మంగళవారం పలమనేరు మండలం మొరం పంచాయతీలో మాజీ మంత్రి అమరనాథరెడ్డి నిర్వహించారు. మొరం పంచాయతీలోని మొరం, నడిం దొడ్డిపల్లి, పెంటగ్రామం, నక్కపల్లి, ఈమాస్ ఇండ్లు, కేటిల్‌ఫారం, కమలాపురం, రామాపురం, రంగనాయనిపల్లి, కన్నమాకులపల్లి, కురప్పల్లి, వెంకటేశపురం కాలనీ, తొప్పనపల్లి, సుబ్బానాయని ఇండ్లు, బండిండ్లు, గజ్జలవారిపల్లెలలో ఇంటింటా టీడీపీ మినీ మ్యానిఫెస్టో కరపత్రాలు అందజేశారు. మొరం, నక్కపల్లి గ్రామాల్లో పార్టీ జెండాలను ఆవిష్కరించారు. కేటిల్‌ఫారంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి ఆయనకండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగ రాజరెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేష్, తెలుగుయువత అధ్యక్షుడు వెంకటమునిరెడ్డి, నాయకులు రామ చంద్ర నాయుడు, జగదీష్‌నాయుడు, రఘునాథరెడ్డి, విశ్వనాథరెడ్డి, రామ్మూర్తినాయుడు, ఆనందనాయుడు, గిరి, కవీంద్రనాయుడు, అనిల్, నాగరాజు, సురేష్, జనసేన నాయకులు దిలీప్, నాగరాజు పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి టీడీపీ ఆర్థికసాయం



రామకుప్పం, జనవరి 2: రామకుప్పం మండలం విజలాపురం పంచాయతీ అంకిరెడ్లపల్లెకు చెందిన టీడీపీ కార్యకర్త కుమ్మరసుబ్బన్న మంగళవారం అనారోగ్యంతో మృతి చెందారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, మాజీ సర్పంచులు శ్రీనివాసులురెడ్డి, రామ్మూర్తి, పార్టీ పంచాయతీ అధ్యక్షుడు కుమార్, నేతలు వేణుగోపాల్‌రెడ్డి, మునెప్ప, బాబురెడ్డి సుబ్బన్న మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. మృతుడి కుటుంబసభ్యులకు పార్టీ తరఫున వారు రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు.

సారా ఊట ధ్వంసం

సదుం, జనవరి 2: మండలంలోని మొరవపల్లె పంచాయతీ గాదెవారిపల్లె గ్రామ పరిసరాల్లో మంగళవారం పోలీసుల దాడిలో 1600 లీటర్ల సారా ఊట, 20 లీటర్ల సారా ధ్వంసం చేసినట్లు ఎస్ఐ మారుతి తెలిపారు. సారా సామాగ్రిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు. సారా తయారీదారులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

చెరువులో పడి మతిస్థిమితంలేని యువకుడి మృతి



మృతి చెందిన యువకుడు గోపి

బైరెడ్డిపల్లె, జనవరి 2 : మండలంలోని కడపనత్తం చెరువులో పడి గోపి(18) అనే మతిస్థిమితం లేని యవకుడు మృతి చెందాడు. కడపనత్తం గ్రామానికి చెందిన నాగభూషణం కుమారుడు గోపి కొంత కాలంగా మతిస్థిమితం లేదు. ఈ క్రమంలో రెండురోజులుగా గోపి కనిపించలేదు. కుటుంబ సభ్యులు పలుచోట్ల వెతికారు. మంగళవారం ఉదయం కడపనత్తం చెరువులో గోపి మృతదేహం తేలుతూ ఉండడాన్ని స్థానికులు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అతడి మృతి తో ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. కాగా దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 2: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిసున్న గో సంరక్షణ ట్రస్టుకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన లాస్యమేద రూ.1,00,116 విరాళంగా అందించినట్లు సూపరింటెండెంట్ కోదండపాణి తెలిపారు. విరాళదాతకు స్వామి దర్శన భాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం.. ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 2: మండలంలోని ముంగరమడుగు క్రాస్ వద్ద మంగళవారం ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్, ఏఈఎస్ శ్రీరామ్ విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎర్రాండ్లపల్లి గ్రామానికి చెందిన రమేష్ తన ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా, అతడిని అదుపులోకి తీసుకుని 37 టెట్రాప్యాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థి

ఐరాల(కాణిపాకం), జనవరి 2: ఇటీవల నంద్యాలలో నిర్వహించిన అండర్-14 ఫెన్సింగ్ పోటీలలో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన భవిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోమల మంగళవారం తెలిపారు. ఈ పోటీలలో భవిత వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు వివరించారు. భవితను, పీడీ దేవాను, కోచ్ కార్తీక్‌లను అభినందించారు.

పైపులైన్ లీకేజీ.. తాగునీరు కలుషితం

పట్టించుకోని అధికారులు- లోపించిన పారిశుధ్యం

పుంగనూరు రూరల్, జనవరి 2: తాగునీటి పైపులైన్ పగిలి నీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోలేదని ఏటవాకిలి దళితవాడ వాసులు విచారం వ్యక్తం చేశారు. ఏటవాకిలి దళితవాడలో దాదాపు రెండు నెలల క్రితం తాగునీటి పైపులైన్ పగిలిపోయింది. అప్పటి నుంచి నీరు లీక్ అవుతోంది. ఆ నీరు వీధుల్లో నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు వృద్ధిచెంది జ్వరాలు ప్రబలు తున్నాయి. తాగునీటిపైపులైను బాగుచేయాలని సచివాలయ, మండల అధికారులను కోరినా స్పందన లేదని ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మురుగు కాలువలు లేవు..

కొద్ది పాటి వర్షం కురిస్తే వీధుల్లో నీరు నిలిచిపోతోంది. సిమెంటు రోడ్లు వేసి మురుగునీటి కాలువలు నిర్మించకపోవడం దీనికి కారణం. అధికారులు స్పందించి కాలువలు నిర్మించాలని, తాగునీటి పైపులైను బాగుచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.



వీధుల్లో నిలచిన మురుగునీరు



లీక్ అవుతున్న పైపు

కేంద్ర పథకాలపై అవగాహన కోసమే వికసిత్ భారత్



చిచ్చిలివారిపల్లెలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పురుషోత్తంరెడ్డి

రొంపిచెర్ల, జనవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహన కల్పించేందుకే వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించామని ఎంపీపీ చిచ్చిలి పురుషోత్తంరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చిచ్చిలివారిపల్లె, బొమ్మయ్యగారిపల్లె పంచాయతీలోని చల్లావారిపల్లెలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం జరిగింది. ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేంద్ర, సర్పంచ్ అరుణమ్మ, కార్యదర్శులు హరిబాబు, శివకుమార్, ఏవో సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఇంటింటికీ తెలుగుదేశం

రొంపిచెర్ల, జనవరి 2: పుంగనూరు నియోజకవర్గంలో ఈ నెల 4 నుంచి 12వ తేదీ వరకు పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఇంటింటికీ తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఐ-టీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరు హరిబాబు వెల్లడించారు. మంగళవారం రొంపిచెర్లలోని పార్టీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడారు. 3వ తేదీ జరగవలసిన పర్యటన కార్యక్రమం అనివార్య కారణాలతో 4వ తేదీకి మార్చినట్లు తెలిపారు. 4వ తేదీ వనమలదిన్నె, 5న సింగరగుంట, మేలుందొడ్డి, 6న మగాండ్లపల్లి, ఏటవాకిలి, 7న మంగళం, 8న భీమగానిపల్లె, పూజగానిపల్లె, 9న మొదుగులపల్లె, ఎంసీ పల్లి, 10న గుడిసిబండ, కుమ్మరనత్తం, 11న చదళ్ల, రాగానపల్లి, 12న అరడిగుంట పంచాయతీలో చల్లా రామచంద్రారెడ్డి పర్యటన ఉంటుందని వివరించారు. ప్రజలు, నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఎస్టీయూ క్యాలెండర్ల ఆవిష్కరణ



సోమల, జనవరి 2: నంజంపేట హైస్కూల్లో మంగళవారం ఎస్టీయూ నూతన సంవత్సర క్యాలెండరును, డైరీని ఆ సంఘం జిల్లా నాయకుడు జగన్ మోహన్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కుసుమాంబ, మోహన్‌రెడ్డి, రాజేశ్, గాయత్రి, వసంతకుమారి, స్వాతి, శ్రీదేవి, రమణబాబు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహ ఆవిష్కరణకు తరలిరండి

సోమల, జనవరి 2: పుంగనూరు సమీపంలో ఈ నెల నిర్వహిం చనున్న శ్రీకృష్ణదేవ రాయల కాంస్య విగ్రహ ఆవిష్కరణకు బలిజలంతా తరలిరావాలని జడ్పీటీసీ అమాస కుసుమ పిలుపునిచ్చారు. మంగళవారం పెద్ద ఉప్పరపల్లె, పేటూరు, ఆవులపల్లె పంచాయ తీల్లో బలిజ సంఘ నాయకులు సమావేశాలు నిర్వహించారు. పుంగనూరు బలిజ సేవా సంఘ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మండలం నుంచి అధికసంఖ్యలో హాజరు కావాలని నిర్ణయించారు. అనంతరం విగ్రహ ఆవిష్కరణ ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు అమాస మోహన్, ప్రభాకర్, వాసుదేవకుమార్, కేవీ రమణ, వీవీ రమణ, గంగాధరం, మను, జగన్, చిట్టిబాబు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన జిల్లా అధికారులు



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న జేసీ

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 2: నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలను మంగళవారం కలెక్టర్ షన్మోహన్‌కు పలువురు జిల్లా అధికారులు తెలిపారు. కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో కలెక్టర్‌కు శాలువా కప్పి, పూలకుండీలు, స్వీట్స్, ఫలాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో రాజశేఖర్, కలెక్టరేట్ ఏవో కులశేఖర్, హౌసింగ్ పీడీ పద్మనాభం, డ్వామాపీడీ గంగాభవానీ, మెప్మా పీడీ రాధమ్మ, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఈ చంద్రశేఖర్ రెడ్డి, డీపీవో లక్ష్మి, డీఈవో విజయేంద్రరావు, డీసీహెచ్ఎస్ రాజశేఖర్ రెడ్డి, ఐ అండ్ పీఆర్ డీడీ పద్మజ, చిత్తూరు మున్సిపల్ కమిషనర్ అరుణ, నగరి ఆర్డీవో సృజన, మీడియా ప్రతినిధులు, వివిధ బ్యాంకుల కంట్రోలింగ్ అధికారులతో పాటు పలువురు జిల్లాస్థాయి అధికారులు ఉన్నారు.

భానుప్రకాశ్‌ను సన్మానించిన టీడీపీ నాయకులు



విజయపురం, జనవరి 2: నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాశ్‌ను మంగళవారం నగరి టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో విజయపురం మండల టీడీపీ కార్యకర్తలు పాల్గొని ఆంగ్ల నూతన సంవత్సరాది శుభాకాంక్షలు తెలిపారు. మండలం నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వెళ్లి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేశ్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు బాలసుబ్రహ్మణ్యంరాజు, లోకేశ్‌రాజు, దశరథరాజు, రాజేంద్రరాజు, వెంకటేసులు, గుణభూషణమ్మ, మురళీ, గుణశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఇంటికి పంపేద్దాం: టీడీపీ



బాబు ష్యూరిటీ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, జనవరి 2: నియంత పరిపాలన సాగిస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతిని గాలికి వదిలిపెట్టిన వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి పంపేయాలంటూ పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ మురళీ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని మొగిలి, గాండ్లపల్లి గ్రామాల్లో మండల అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి కరపత్రాలను పంచిపెట్టారు. నాయకులు కమల్‌నాథ రెడ్డి, హేమచంద్ర నాయుడు, జనార్దన్, వంశీ, మంజునాథ్, కోదండ, బాలసుబ్రహ్మణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అభివృద్ధి

పాలసముద్రం, జనవరి 2: టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి శేఖర్ రాజు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రంగాపురం గ్రామంలో బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేసి వైసీపీ ప్రభుత్వం వైఫల్యాల గురించి ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం నాయుడు, హేమాద్రి, భక్తవత్సలం నాయుడు, భాస్కర్ నాయుడు, దామోదరం, బాల, అరుళ్‌నాథన్ పాల్గొన్నారు.

అభివృద్ధి జరగాలంటే చంద్రబాబు రావాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న అరుణ

పెనుమూరు, జనవరి 2: రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలన్నా, ప్రజలు సంక్షేమంతో జీవించాలన్నా చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని జిల్లా మహిళా అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. మంగళవారం ఆమె మండలంలోని ఉగ్రాణంపల్లిలో ఇంటింటికి వెళ్లి బాబు ష్యూరిటీ... భవిష్యత్తుకు గ్యారెంటీ పత్రాలను పంపిణీ చేశారు. ప్రజలతో మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ఇప్పుడు ఉన్న పరిస్థితులను వారికి తెలియజేశారు. టీడీపీ నేతలు హిమగిరి నాయుడు, ఏకాంబరం పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎంపై దుష్ప్రచారం తగదు: వైసీపీ



మీడియాతో మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 2: డిప్యూటీ సీఎం నారాయణస్వామిపై పార్టీలోని అసంతృప్తి వర్గం దుష్ప్రచారం చేయడం తగదని వైసీపీ నాయకులు అన్నారు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో గంగాధరనెల్లూరు నియోజకవర్గంలోని పెరుమాళ్లపల్లె, ఏకాంబరకుప్పం ఎంపీటీసీలు మురళిరెడ్డి, ఎంపీటీసీ రాధిక మీడియాతో మాట్లాడారు. నారాయణస్వామి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. అయితే పార్టీలోని కొంతమంది పెత్తందారులు దళితుడనే చిన్నచూపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు పురంధర్, విజయ్, శేఖర్‌రెడ్డి, పరంధామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయండి: కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 2: పశువుల్లో వచ్చే గాలికుంటు వ్యాధి ప్రబలకుండా క్షేత్రస్థాయిలో టీకాలు వేయాలని కలెక్టర్ షన్మోహన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సహాయంతో కొనసాగుతున్న 32వ విడత గాలికుంటువ్యాధి టీకా కార్యక్రమాన్ని మంగళవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గోడపత్రికలను ఆయన ఆవిష్కరించారు. అధికారులు మాట్లాడుతూ జిల్లాకు 4.91 లక్షల గాలికుంటు వ్యాధి నివారణ డోసులు అందాయని కలెక్టర్‌కు వివరించారు. పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రభాకర్, డాక్టర్లు చంద్రశేఖర్, మృణాళిని, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

కార్వేటినగరం, జనవరి 2: జాతీయ గాలికుంటు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా కార్వేటినగరంలో పశువులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పశు వైద్యాధికారులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా 100 పశువులకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ, పశు వైద్యాధికారి హేమకుమార్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్నవారికి కృతజ్ఞతలు

చిత్తూరు సిటీ, జనవరి 2: తమ ఆహ్వానాన్ని అందుకుని నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నందుకు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు డీకే బద్రినారాయణ చెప్పారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ తమ నివాసంలో నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు.

గైర్హాజరైన విద్యార్థులపై దృష్టి పెట్టండి: డీఈవో

చిత్తూరు (సెంట్రల్), జనవరి 2: ప్రభుత్వ పాఠశాలల్లో దీర్ఘకాలికంగా గైర్హాజరైన విద్యార్థులపై దృష్టిసారించాలని డీఈవో విజయేంద్రరావు ఆదేశించారు. పాఠశాలల తనిఖీల్లో భాగంగా మంగళవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పలు రికార్డులు పరిశీలించారు. అనంతరం హెచ్ఎం పూర్వాణికి పలు సూచనలు చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరును క్షుణ్ణంగా పరిశీలించారు. సిలబస్ సకాలానికి పూర్తి చేయకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. సెక్టోరియల్ అధికారులు డీఈవో వెంట ఉన్నారు.

రేషన్ పంపిణీ తనిఖీ

యాదమరి, జనవరి 2: మండలంలోని మాదిరెడ్డిపల్లెలో జేసీ శ్రీనివాసులు ఇంటింటికి రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్డుదారులతో నిత్యావసర వస్తువుల నాణ్యతపై ఆరాతీశారు. ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తహసీల్దార్ పర్యవేక్షించాలన్నారు. ఈ నెల నుంచి వలంటీర్ల ద్వారా కూడా నిత్యావసర వస్తువుల పంపిణీ నిర్ణీత పాయింట్ల ద్వారా చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంట తహసీల్దార్ హనుమంత నాయక్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గో సంరక్షణ ట్రస్టుకు రూ.లక్ష విరాళం



ఐరాల(కాణిపాకం), జనవరి 2: స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గో సంరక్షణ ట్రస్టుకు కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన లాస్యమేద రూ.1,00,116 విరాళంగా అందించినట్లు సూపరింటెండెంట్ కోదండపాణి తెలిపారు. విరాళదాతకు స్వామి దర్శన భాగ్యం కల్పించి, స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండండి

● ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ ఆగ్రహం

గుడిపాల, జనవరి 2: ప్రజలకు అందుబాటులో ఉండాలని సచివాలయ సిబ్బందిని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని గుడిపాల పంచాయతీ సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్లు, ఏఎన్ఎం, ఆశావర్కర్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బాబు రాజేంద్రప్రసాద్, ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి, వైద్యాధికారిణి సంధ్య, వైసీపీ నాయకులు శింబు తదితరులు పాల్గొన్నారు.

మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు

బంగారుపాళ్యం, జనవరి 2: మండలంలోని ముంగరమడుగు క్రాస్ వద్ద మంగళవారం ఎస్ఈబీ సీఐ చంద్రశేఖర్, ఏఈఎస్ శ్రీరామ్ విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎర్రాండ్లపల్లి గ్రామానికి చెందిన రమేష్ తన ద్విచక్రవాహనంలో కర్ణాటక మద్యాన్ని తరలిస్తుండగా, అతడిని అదుపులోకి తీసుకుని 37 టెట్రాప్యాకెట్లను, ద్విచక్రవాహనాన్ని స్వాధీన పరచుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

పేద వృద్ధులకు దుప్పట్ల పంపిణీ



శ్రీరంగరాజపురం, జనవరి 2: ఎస్ఆర్‌పురం మండలం ఒడ్డుపల్లె గ్రామానికి చెందిన ఎనర్జియా లైఫ్ సైన్సెస్ ట్రస్ట్ మేనేజింగ్ డైరెక్టర్ నవీన్, రాజీవ్ చంద్రబోస్ ఆధ్వర్యంలో 300మంది పేద వృద్ధులకు ఉచితంగా దుప్పట్లు, చీరలు, స్వీట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వేలూరు పాస్టర్ విజయ్‌కుమార్, సీఎంసీ డాక్టర్ జీవరత్నం దంపతులు, పాస్టర్ అబెల్ ప్రభు, రాజుచంద్రబోస్(చిన్ని), మునికృష్ణ, యాకుబ్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడాపరికరాల వితరణ



నగరి, జనవరి 2: నగరి మండల పరిధిలోని నాగరాజుకుప్పం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఇతర ఉపాధ్యాయులు రూ.25,000 సేకరించి క్రీడాపరికరాలను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పీడీ కేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ఉత్తరా నక్షత్ర పూజలు

నగరి, జనవరి 2: నగరి పట్టణ పరిధిలోని అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం అయ్యప్పస్వామి జన్మనక్షత్రం అయిన ఉత్తరా నక్షత్ర పూజలు వైభవంగా నిర్వహించారు. అర్చన మంత్రాలను భక్తులు ఉచ్చరిస్తూ భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. మాధురి, దిలీప్‌కుమార్‌లు ఉభయదారులుగా పూజలు చేయించి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వామి మురళి, కన్నప్ప నాయుడు, రమేష్‌బాబు, దుర్గాప్రకాష్, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



యాదమరి, జనవరి 2: ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం ఎస్టీయూ-2024 క్యాలెండర్, డైరీలను ఎంఈవో రుక్మిణమ్మ, ఎంపీడీవో శివరాజ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులకు ఉపాధ్యాయులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల శాఖ అధ్యక్షులు గుణశేఖరన్, ప్రధాన కార్యదర్శి రమేష్, గౌరవాధ్యక్షులు ఎస్ఎన్ బాష, జిల్లా ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, సంఘ నేతలు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

గంగాధరనెల్లూరు, జనవరి 2: గంగాధరనెల్లూరు ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం రూ.3వేల సామాజిక పింఛన్లను డిప్యూటీ సీఎం నారాయణస్వామి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఎంపీపీ అబ్బూ అనిత, నేతలు వేల్కూరు బాబురెడ్డి, గుణారెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, వైస్ ఎంపీపీ హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్చకుల సమస్యలు తెల్పండి

చిత్తూరు కల్చరల్, జనవరి 2: జిల్లా వ్యాప్తంగా ఆలయాల్లో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అర్చక సమాఖ్యకు రాతపూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని సమాఖ్య అధ్యక్షులు వేణుగోపాల్, సెక్రటరి సుధాకర్ గురుకుల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవదాయశాఖ పరిధిలోని ఆలయాల పాలకమండళ్ల విధి నిర్వహణలో అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలను అర్చక మిత్రులు త్వరితగతిన తెలియజేసి, ప్రభుత్వం నుంచి లబ్ధి పొందాలని వారు కోరారు.

అగరంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

నింద్ర, జనవరి 2: మండలంలోని అగరం సచివాలయ పరిధిలో మంగళవారం రెండవ దశ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలకు ప్రత్యేక సూచనలు, వైద్య పరీక్షలు చేశారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, ఎంపీడీవో అరుణ, వైస్ ఎంపీపీ శుభా, వైద్యసిబ్బంది, సర్పంచ్ చెల్లెమ్మ, మండల ప్రత్యేకాధికారి సతీష్‌కుమార్, నాయకులు దామోదరం, సెల్వం, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించండి సారూ...



కలెక్టర్‌కు వినతి పత్రం ఇస్తున్న సమగ్రశిక్ష ఉద్యోగులు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 2: మా జీవితాలకు, కుటుంబాలకు సంబంధించి ఉద్యోగ భద్రత, సమానపనికి సమాన వేతనం వంటి ప్రధాన సమస్యలు తీర్చి న్యాయం చేయాలని కోరుతూ సమగ్రశిక్ష ఉద్యోగులు కలెక్టర్ షన్మోహన్‌కు వినతిపత్రం సమర్పించారు. డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు చేపట్టిన సమ్మె మంగళవారానికి 14వ రోజుకు చేరింది. సమస్యలు పరిష్కరించకపోతే మాకు చావేగతిని ఆవేదన వ్యక్తం చేస్తూ తాళ్లతో ఉరి వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో సంఘం నాయకులు సెల్వరాజ్, సిద్ధరామయ్య సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. నిరసన తెలిపిన వారిలో జేఏసీ నాయకులు విశ్వనాథం, శ్రీనివాసులు, కృష్ణమూర్తి, ప్రకాష్, శరత్‌బాబు, చందు, యమునా, లావణ్య, సురేఖ, దేవరాజ్, దేవేంద్ర, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నగరపాలక సంస్థలో అవినీతి: టీడీపీ



మాట్లాడుతున్న సప్తగిరి ప్రసాద్

చిత్తూరు సిటీ, జనవరి 2: చిత్తూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో అవినీతి కంపు కొడుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ ఆరోపించారు. మంగళవారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో జరుగుతున్న అవినీతిపై మీడియాలో ప్రతిరోజు వార్తా కథనాలు వస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలు కలుగుతున్నాయని అన్నారు. నగరపాలక సంస్థలోని పట్టణ ప్రణాళిక, రెవిన్యూ, ఇంజనీరింగ్ విభాగాల్లో కొందరు అక్రమార్కుల దోపిడీకి అడ్డు అదుపూ లేకుండా పోతోందని చెప్పారు. రెవెన్యూ విభాగంలో కొందరు ఉద్యోగులు పన్నులు వసూలు చేయకుండా లంచాలు వసూలు చేసి నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారని విమర్శించారు. పట్టణ ప్రణాళికా విభాగంలో ఏ భవన నిర్మాణానికి అనుమతి కావాలన్నా, టైటిల్ మార్చాలన్నా అధికారుల చేతులు తడపాల్సిందేనని పేర్కొన్నారు. ఇంజనీరింగ్ విభాగంలో డీజిల్ కుంభకోణం పెద్దఎత్తున జరిగిందని ఆరోపించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో డబ్బు ఇవ్వనిదే ఏపని జరగదని అన్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలో జరుగుతున్న అవినీతి అక్రమాలపై ఏసీబీ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. జిల్లా పార్టీ కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు మేషాక్, శశికర్ బాబు, మంజూ పాల్గొన్నారు.

పోగొట్టుకున్న చైను, నగదు బాధితులకు అప్పగింత



బాధితులకు చైను, నగదు అందచేస్తున్న నగరి పోలీసులు

నగరి, జనవరి 2: నగరి పట్టణ పరిధిలో డిసెంబరు 31వ తేదీన పోగొట్టుకున్న 2సవర్ల బంగారం, రూ.13,000 నగదును పోలీసులు మంగళవారం బాధితులకు అందించారు. పోలీసుల కథనం మేరకు... తమిళనాడు రాష్ట్రానికి చెందిన తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి తాలూకా పూనిమాంగాడు గ్రామానికి చెందిన శక్తివేల్, భార్య అన్నరసి డిసెంబరు 31న వ్యక్తిగత పని నిమిత్తం నగరి వచ్చారు. స్థానిక శ్రీనివాసా థియేటర్ సమీపంలో 2సవర్ల బంగారు చైను, రూ.13,000 నగదును పోగొట్టుకున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీసీ కెమెరాల సాయంతో నగరి సీఐ సురేష్ తన సిబ్బందితో కలిసి విచారించారు. కింద పడిన వాటిని తీసుకున్న వ్యక్తులను గుర్తించి, వారి నుంచి బంగారాన్ని, నగదును స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు వీటిని మంగళవారం బాధితులకు అప్పగించారు.

నారా లోకేశ్‌ను కలసిన జగన్మోహన్



లోకేశ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న జగన్మోహన్

చిత్తూరు సిటీ, జనవరి 2: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్, టీడీపీ సీనియర్ నేత గురజాల జగన్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఉండవల్లిలోని నారా లోకేశ్ నివాసంలో కలసి పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం చిత్తూరు నియోజకవర్గ పార్టీ విషయాలపై చర్చించారు.

అందుబాటులో ఉద్యోగుల పీఎఫ్ వివరాలు: జడ్పీ సీఈవో



ఎస్టీయూ డైరీని ఆవిష్కరిస్తున్న జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 2: జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయుల భవిష్యనిధి ఖాతాల చందా మొత్తాల వివరాలను జడ్పీ కార్యాలయంలో అందరికీ అందుబాటులో ఉంచామని జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గంటా మోహన్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్టీయూ ప్రతినిధి బృందం మంగళవారం జడ్పీ సీఈవోను కలిసింది. ఈ సందర్భంగా సీఈవో ఎస్టీయూ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎస్టీయూ నాయకులు మాట్లాడుతూ భవిష్యనిధి ఖాతా మొత్తాల వివరాలు అందుబాటులో ఉంచకపోవడం వల్ల రుణాలు పొందాల్సినవారు, పదవీ విరమణ చెందేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఆన్‌లైన్‌లో పీఎఫ్ స్లిప్పులు అందుబాటులో ఉంచాలని కోరారు. అందుకు జడ్పీ సీఈవో వివరణ ఇస్తూ రాష్ట్రస్థాయిలో పీఎఫ్ స్లిప్పులు సాంకేతిక కారణాలవల్ల అందుబాటులో రానప్పటికీ తాము ప్రత్యేక దృష్టి సారించి అందుబాటులో ఉంచామని చెప్పారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దేవరాజులు రెడ్డి, డి. మోహన్, ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్ రెడ్డి, నాయకులు గుణశేఖర్, కళ్యాణ్, ప్రభుకుమార్, మధుబాబు, బాలాజి, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన రాష్ట్రం కోసమే 'ఆరోగ్య సురక్ష'



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

యాదమరి, జనవరి 2: ఆరోగ్యవంతమైన రాష్ట్రం కోసమే జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం అని డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రభావతిదేవి అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమాన్ని మంగళవారం మండలంలోని దాసరాపల్లె సచివాలయం వద్ద ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఈ శిబిరాల్లో నయంకాని వ్యాధులున్న రోగులను గుర్తించి, కార్పొరేట్ ఆస్పత్రులకు తరలించి వైద్య చికిత్స అందిస్తామన్నారు. ఆరోగ్యశ్రీకార్డు ద్వారా రూ.25 లక్షల వరకు ఉచితంగా వైద్యం, శస్త్రచికిత్సలు చేయించడానికి నూతనకార్డులను జారీచేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని జాయింట్ డైరెక్టర్ సునీల్ కుమార్ నాయక్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సుబ్రహ్మణ్యం, వైద్యాధికారులు డాక్టర్ సురేఖ, అనిల్‌కుమార్ నాయక్, వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

శ్రీరంగరాజపురం, జనవరి 2: మండలంలోని ముద్దికుప్పం గ్రామ సచివాలయంలో మంగళవారం రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి హాజరయ్యారు. పేద వృద్ధులకు ఉచితంగా కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర జగనన్న ఆరోగ్య సురక్ష నోడల్ అధికారి సుకుమార్ నాయక్, డీఎంహెచ్‌వో ప్రభావతి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రవిరాజు, ఎంపీడీవో కృష్ణయ్య, తహసీల్దార్ బెన్నూరాజ్ తదితరులు పాల్గొన్నారు.

226 మందికి వైద్యపరీక్షలు

పాలసముద్రం, జనవరి 2: మండలంలోని వనదుర్గాపురం సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని డాక్టరు లక్ష్మీపతి, డాక్టర్ మోహనకృష్ణ, డాక్టర్ ధర్మారెడ్డి, డాక్టర్ భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి, వారికి కావాల్సిన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాలసముద్రం ఆస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శివప్రకాష్ రాజు, జడ్పీటీసీ అన్బు, ఎంపీడీవో రామనాథ రెడ్డి, తహసీల్దార్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ మందిర ప్రాణ ప్రతిష్ఠ ఉత్సవంలా జరుపుకోవాలి



అక్షితలు అందజేస్తున్న చిట్టిబాబు

చిత్తూరు (సెంట్రల్), జనవరి 2: అయోధ్య శ్రీరామ మందిరం బాల రాముడి నూతన విగ్రహం ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలను ఇంటింటా ఉత్సవంలా జరుపుకోవాలని బీజేపీ సీనియర్ నాయకులు చిట్టిబాబు ఆకాంక్షించారు. మంగళవారం మిట్టూరు ప్రాంతంలో శ్రీరామ జన్మభూమి ట్రస్టు పంపిన అక్షతలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీరామ సేవకులు హరినాథ్, కార్తిక్, సునీల్, శ్రీనివాసులు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

గుడిపాల: మండలంలోని చీలాపల్లి పంచాయతీలో అయోధ్య రామమందిరం ఆధ్వర్యంలో అక్షతల వితరణ కార్యక్రమాన్ని మండల మాజీ బీజేపీ అధ్యక్షుడు స్వామినాథ్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి సోమనాథ్, ఏలుమలై, నాటామ, పెరుమాళ్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు అక్షతల పంపిణీ

చిత్తూరు కల్చరల్, జనవరి 2: అయోధ్య రామాలయ అక్షతలను మంగళవారం జిల్లా వీహెచ్‌పీ నాయకులు కలెక్టర్ షన్మోహన్‌కు అందజేశారు. అదే విధంగా వారు కలెక్టర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీహెచ్‌పీ నాయకులు ఎస్వీ వేలు, విజయసింహారెడ్డి, జగదీష్ నాయుడు, రామ్మూర్తి, సిద్ధా తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు

చిత్తూరు, జనవరి 2: నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి కనీస వసతులపై నివేదిక సమర్పించాలని కమిషనర్ అరుణ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అన్ని విభాగాల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. నగరపాలక సంస్థ పరిధిలోని 150 కేంద్రాలను అధికారులను తనిఖీలు చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న సౌకర్యాలు, అవసరమైన వాటిని నివేదిక రూపంలో ఇవ్వాలన్నారు.

● నేటి నుంచి నగరపాలక పరిధిలో ఆరోగ్య సురక్ష కార్యక్రమం

చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో బుధవారం నుంచి జరగనున్న జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసీ గోవర్ధన్, ఎంఈ గోమతి, ఏసీపీ రామకృష్ణుడు, తదితర అధికారులు పాల్గొన్నారు.

340వ రోజుకు చేరిన అన్నక్యాంటీన్

చిత్తూరు సిటీ, జనవరి 2: స్థానిక కొంగారెడ్డిపల్లెలో నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్ 340వ రోజుకు చేరింది. మంగళవారం టీడీపీ నేత ఆర్.నాగరాజు నాయుడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రాజశేఖర్, సురేష్, శివాజీ, వెంకటేష్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



చిత్తూరు రూరల్, జనవరి 2: ఆల్ ఆంధ్రప్రదేశ్ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ షన్మోహన్ మంగళవారం ఆయన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్రమణ్యం, జిల్లా అధ్యక్షుడు హరికృష్ణ, కార్యదర్శి మునికృష్ణారెడ్డి, కోశాధికారి శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి రాజా తదితరులు పాల్గొన్నారు.

తక్కనకుంటను సర్వే చేసిన రెవెన్యూ అధికారులు



సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బంగారుపాళ్యం, జనవరి 2: మండలంలోని తగ్గువారిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న తక్కనకుంట దురాక్రమణను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. 'అన్యాక్రాంతం అవుతున్న తక్కనకుంట' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో మంగళవారం ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన పలమనేరు ఆర్డీవో మనోజ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు దురాక్రమణను పరిశీలించి, నివేదిక రూపొందించి ఆర్డీవోకు పంపనున్నట్లు మండల రెవెన్యూ అధికారులు తెలిపారు. సచివాలయ సర్వేయర్ సుమలత, వీఆర్వో పయణి తదితరులు ఉన్నారు.

జడ్పీలో న్యూఇయర్ వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 2: జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు చాంబర్‌లో మంగళవారం నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలు జరిగాయి. కేక్ కట్‌చేసి పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు, పీఆర్ అధికారులు, జడ్పీ సిబ్బందికి చైర్మన్ పంచిపెట్టారు. చైర్మన్‌ను జడ్పీ సీఈవో ప్రభాకర్ రెడ్డి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ వైస్‌చైర్‌పర్సన్ రమ్య, పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, పీఐయూ ఈఈ రవణయ్య పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకోవడమే 'జీజేఎం' లక్ష్యం



ఓంశక్తి భక్తులకు చీరలు పంపిణీ చేసిన చెన్నకేశవులు నాయుడు

గుడిపాల, జనవరి 2: నిరుపేదలను ఆదుకోవడమే జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ లక్ష్యమని ట్రస్టు నిర్వాహకుడు చెన్నకేశవులు నాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని వెప్పాలమానుచేను గ్రామంలో ఓంశక్తి భక్తులకు ఉచితంగా చీరలు పంపిణీ చేసి, బస్సులను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు, ఆనంద్ యాదవ్, రాజేష్, షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

మేల్‌మరువత్తూర్‌కు ఉచిత బస్సులు

చిత్తూరు సిటీ, జనవరి 2: ఓం శక్తి భక్తులు మేల్‌మరువత్తూర్‌కు వెళ్లి రావడానికి జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత బస్సులను ఏర్పాటుచేశారు. మంగళవారం రాత్రి చిత్తూరు రూరల్ మండలం తుమ్మిందపాళ్యం పంచాయతీలోని వివిధ గ్రామాల ఓం శక్తి భక్తుల ప్రత్యేక పూజల్లో జీజేఎం చారిటబుల్ ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు. ఓం శక్తి భక్తులకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. భక్తులకోసం జీజేఎం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బస్సులను మంగళవారం రాత్రి చెన్నకేశవులు నాయుడు జెండాఊపి ప్రారంభించారు. టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఐరాల విద్యార్థిని



జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైన భవితతో హెచ్ఎం, పీడీ, కోచ్

ఐరాల(కాణిపాకం), జనవరి 2: ఇటీవల నంద్యాలలో నిర్వహించిన అండర్-14 ఫెన్సింగ్ పోటీలలో ఐరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన భవిత జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోమల మంగళవారం తెలిపారు. ఈ పోటీలలో భవిత వ్యక్తిగత విభాగంలో సిల్వర్ మెడల్ సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు ఛత్తీస్‌గఢ్‌లో నిర్వహించే జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలలో పాల్గొననున్నట్లు ఆమె వివరించారు. ఈ సందర్భంగా భవితను, పీడీ దేవా, ఫెన్సింగ్ కోచ్ కార్తీక్‌లను ఆమె అభినందించారు.

రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేసుకోవాలి

శ్రీరంగరాజపురం, జనవరి 2: డీకేటీ భూములు కలిగిన ప్రతి రైతు సెటిల్మెంట్ పట్టా పొందడానికి ఈకేవైసీ చేసుకోవాలని ఆర్డీవో చిన్నయ్య తెలిపారు. మంగళవారం రాత్రి మెదవాడ, 49.కొత్తపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు. డీకేటీ భూములు కలిగిన పట్టాదారులు శాశ్వత పట్టా చేసుకోవడానికి ఈకేవైసీ చేస్తున్న వలంటీర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బెన్నూరాజ్, డీటీ లోకనాథంపిళ్లై, ఆర్ఐ ప్రభాకర్, వీఆర్వో చంద్రబాబు, రవి, వీఆర్ఏలు తదితరులు పాల్గొన్నారు.